సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం | 30 | ఆగస్టు | 2025



గోదావరి పరవళ్లు

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం పుష్కర ఘాట్లను తాకుతూ గోదావరి పరవళ్లు తొక్కుతోంది. - 8లో▸



సమాచార హక్కు చట్టంతో..

సమాచార హక్కు చట్టంతో పౌరులకు పారదర్శకమైన పాలన అందించబడుతుందని కమిషనర్లు అయోధ్యరెడ్డి, శ్రీనివాస్‌రావు తెలిపారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.4°/25.3°

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత ఉంటుంది. రాత్రి పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వినాయకుడి అలంకరణలో గణపేశ్వరుడు



గణపురం: గణపతి నవ రాత్రుల సందర్భంగా గణపురం మండలకేంద్రం లోని కాకతీయ కళాక్షేత్రం కోటగుళ్లలో గణపేశ్వరుడిని వినాయకుని రూపంగా ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం ఆలయ అర్చకుడు నాగరాజు, పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గణపేశ్వర స్వామి శివలింగాన్ని గణపతి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

పెన్షన్ విద్రోహ దిన కరపత్రాల ఆవిష్కరణ



భూపాలపల్లి అర్బన్: సెప్టెంబర్ 1న నిర్వహించనున్న పెన్షన్ విద్రోహ దిన కరపత్రాలను టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్, గెజిటెట్ ప్రధానోపాధ్యాయుల సంఘం, పీఆర్‌టీయూ, డీటీఎఫ్, సంఘాల జిల్లా నాయకులు మధుసూదన్, రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, అశోక్, సేవానాయక్, రఘుకుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో ప్రత్యేక గుర్తింపు



కాటారం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని జిల్లా అథ్లెటిక్స్ చైర్మన్ పంతకాని సమ్మయ్య అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణతో పాటు దామెరకుంట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. దామెరకుంట పాఠశాలలో పీడీ రాధ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కుమార్, రవీందర్, విజేందర్, సాజిదాబేగం, చైతన్య, వెంకటరమణ, శ్రీధరాచార్యుల సహకారంతో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కాటారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అథ్లెటిక్ చైర్మన్ పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, డాక్టర్ బండి శ్రీనివాస్, డొంగిరి చంద్రయ్య, ఆత్మకూరి కుమార్‌యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవిలోనే పోస్టుమార్టం

కాటారం: కాటారం మండలం మేడిపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన అనుమానాస్పద స్థితిలో లభ్యమైన కప్పల వర్షిణి (22) మృతదేహానికి శుక్రవారం ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో వంద పడకల ఆస్పత్రి ఫోరెన్సిక్ ప్రొఫెసర్, వైద్య సిబ్బంది ద్వారా పోస్టుమార్టం చేయించారు. వర్షిణిది హత్యగానే భావించిన పోలీసులు క్లూస్ టీం సీఐ ఉపేందర్ నేతృత్వంలో ఆధారాలు సేకరించారు. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం యువతి స్వగ్రామం ఒడితలకు తరలించగా మృతురాలి కుటుంబ సభ్యులు ఖననం చేశారు. వర్షిణి హత్యపై కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలోని కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల విచారణ ముమ్మరం చేస్తేనే వాస్తవాలు తెలిసే అవకాశం ఉంది.

అర్హతకు మించి వైద్యం చేయొద్దు

వాజేడు: ఆర్‌ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయొద్దని జిల్లా వైద్యాధికారి గోపాలరావు అన్నారు. వాజేడు మండలంలోని ఆర్‌ఎంపీ ప్రథమ చికిత్స కేంద్రాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంటి బయాటిక్స్‌ను అధిక మోతాదులో ఇవ్వొద్దని, స్టిరాయిడ్స్‌తో చికిత్స చెయొద్దన్నారు. రోగులకు ఇంజక్షన్లు, ఐవీ ఫ్లూయిడ్స్ పెట్టవద్దన్నారు.

‘రెవెన్యూ’లో వేళ్లూనిన అవినీతి!

అడ్డదారుల్లో కొందరు తహసీల్దార్లు, అధికారులు

- భూసమస్యల పరిష్కారానికి రూ.లక్షల్లో డిమాండ్
- తీవ్ర ఆరోపణలు వస్తున్నా.. మారని తీరు
- ఆదాయానికి మించిన ఆస్తుల వివాదంలో బండి నాగేశ్వర్‌రావు
- ఏసీబీ దాడులతో మళ్లీ కలకలం.. రెవెన్యూ శాఖలో చర్చనీయాంశం



తహసీల్దార్ నాగేశ్వర్‌రావు ఇంట్లో బంగారం, ఆస్తుల వివరాలు లెక్కిస్తున్న ఏసీబీ అధికారులు



హనుమకొండ చైతన్యపురిలోని తన ఇంట్లో కూర్చున్న తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు



చైతన్యపురిలో నాగేశ్వర్‌రావు ఇల్లు

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూశాఖలో అవినీతి పరాకాష్టకు చేరుతోంది. కొందరు తహసీల్దార్లు, అధికారులు అక్రమాదాయానికి కొత్తదారులు వెతుక్కుని మరీ అవినీతికి పాల్పడుతుండడం వివాదాస్పదమవుతోంది. కిందిస్థాయిలో పలువురు వీఆర్వోలు, వీఆర్‌ఏల నుంచి పైస్థాయిలో సర్వేయర్లు, ఇన్‌స్పెక్టర్లు, తహసీల్దార్ల వరకు అవినీతి రాజ్యమేలుతోంది. ప్రతీ పనికి ఓ రేటు నిర్ణయించి వసూలు చేస్తున్న కొందరి తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారు. చేయి తడిపితే తప్ప దస్త్రం కదిలించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇదే సమయంలో ఓ వైపు శాఖాపరమైన చర్యలు.. మరోవైపు ఏసీబీ దాడులు చేస్తున్నా కొందరు తహసీల్దార్ల తీరు మారడం లేదు. తాజాగా ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. శుక్రవారం ఆయన ఇంటితో పాటు కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లపై ఐదు చోట్ల ఏకకాలంలో దాడులు నిర్వహించడం సంచలనంగా మారింది. ప్రాథమికంగా రూ.5 కోట్ల అక్రమాస్తులను గుర్తించిన ఏసీబీ.. కీలక పత్రాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తుండడం రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపుతోంది.

ఆది నుంచి అవినీతి ఆరోపణలు.. 2022లో వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు..

ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించిన కేసులో అరెస్టయిన తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుపై గతంలోనూ అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ధర్మసాగర్, కాజీపేట, హసన్‌పర్తితోపాటు ఉమ్మడి వరంగల్, కరీంనగర్‌లో పలుచోట్ల పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఫిర్యాదులు అధికారులు అందాయి. తహసీల్దార్ ఉద్యోగంతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో భాగస్వామిగా చేరి రెండు చేతులా సంపాదిస్తూ ప్రభుత్వ, అసైన్డ్‌భూములను అప్పనంగా కట్టబెట్టారన్న ఫిర్యాదు మేరకు 2019లో అప్పుడున్న కలెక్టర్ విచారణ జరిపారు. ధర్మసాగర్ మండలంలోని ఓ గ్రామంలో గుట్టను విక్రయించి రిజిస్ట్రేషన్ చేసి పాస్‌పుస్తకాలు జారీ చేయడం వివాదంగా మారింది. 1976లో హసన్‌పర్తి శివారు కోమటిపల్లిలో కొనుగోలు చేసిన సీకేఎం కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్‌కు చెందిన 29 గుంటల భూమిని నగరానికి చెందిన ముగ్గురికి రిజిస్ట్రేషన్ చేసి వారి నుంచి రూ.45 లక్షలు తీసుకున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయమై బాధితులు 2022లో అప్పటి సీపీ, డీసీపీ, ఏసీపీకి ఫిర్యాదు చేశారు. తహసీల్దార్‌తోపాటు ఆ ముగ్గురిపై చేసిన ఫిర్యాదుపై విచారణ జరిగినా ఇప్పటికీ నానుతోంది. వరంగల్, హైదరాబాద్‌లో విలాసవంతమైన భవనాలను నిర్మించడంతోపాటు ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగుచూడడంతో స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు కూడా ఆయన దరఖాస్తు చేసుకున్నారు. చివరకు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ దాడులు చేయడం చర్చనీయాంశమవుతోంది.

ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లు పరిశీలన, స్వాధీనం

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. బీరువా, కౌంటర్లు, క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రతీ ఫైల్‌ను పరిశీలించి కొన్నింటిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మండల ఏర్పాటు నుంచి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేయడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

ఏసీబీ దాడులు చేస్తున్నా వెరవని వైనం..

- 2024లో భూసేకరణలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై వరంగల్ ఆర్డీఓ సిడాం దత్తును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.
- వరంగల్ జిల్లా సంగెం తహసీల్దార్ రాజేంద్రనాథ్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లో ఏకంగా సంయుక్త పాలనాధికారి సీసీ రూ 45 వేలు తీసుకుంటూ అడ్డంగా దొరికాడు.
- హనుమకొండ జిల్లా నడికూడ మండల ఆర్‌ఐ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
- భూపాలపల్లిలో రెవెన్యూ అధికారులకు లంచమివ్వాలని, లేదంటే తమ పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం లేదని వృద్ధ దంపతులు భిక్షాటన చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.
- వెంకటాపూర్‌లో ఓ రైతు తనకున్న భూమిని పట్టా చేయాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేసి, చివరకు విసిగిపోయి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.
- ఇలా ఆరోపణలు వచ్చిన పలువురిపై బదిలీలు, సస్పెన్షన్, వీఆర్‌లో వేటు పడినా.. రాజకీయ పలుకుబడితో మళ్లీ కీలక మండలాల్లో పోస్టింగ్‌లు తెచ్చుకుని అదే తంతు కొనసాగిస్తున్నారు.
- నాలుగేళ్లలో అవినీతి నిరోధక శాఖ ఉమ్మడి జిల్లాలో 66కు పైగా వివిధ శాఖలకు చెందిన వారిని పట్టుకుంది. అందులో రెవెన్యూ శాఖదే అగ్రస్థానం ఉండడం గమనార్హం. అయినా ఆ శాఖలో పని చేస్తున్న కొందరిలో మార్పు రావడం లేదన్న చర్చ జరుగుతోంది.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ కిరణ్ ఖరే



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెండింగ్, విచారణలో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతీ పోలీసు అధికారి క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి ప్రజల విశ్వాసం పొందాలన్నారు. మహిళల భద్రత, పిల్లల రక్షణ, అక్రమ రవాణా, సైబర్ నేరాలు, రౌడీషీటర్ల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి పహారా తప్పకుండా జరగాలని, ఇంటెలిజెన్స్ పెంచడం, కొత్తగా వెలుగులోకి వస్తున్న నేర ధోరణులను క్షుణ్ణంగా గమనించి తగు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

క్రీడలతో ఐకమత్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



క్రీడాకారులకు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, అధికారులు

భూపాలపల్లి రూరల్: క్రీడలు ఐకమత్యాన్ని చాటడమే కాక ఆరోగ్య, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జాతీయ క్రీడా దినోత్సవ ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు సైతం ప్రాధాన్యత కల్పిస్తూ క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందని అన్నారు. జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం నిర్మాణానికి రూ.6కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మండల కేంద్రాలలో కూడా క్రీడా మైదానాల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. క్రీడాకారులు క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా క్రీడలు, యువజన సర్వీసులు శాఖ అధికారి రఘు, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎల్.జైపాల్, క్రీడాకారులు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్యం అందించాలి

జిల్లా వైద్యారోగ్యశాఖ శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్



రోగుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ మధుసూదన్

కాటారం: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ వైద్యులు, వైద్య సిబ్బందికి సూచించారు. కాటారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో పరిశుభ్రత, సౌకర్యాలు, మందులు, వైద్య సిబ్బంది హాజరు పట్టిక, ఓపీ రికార్డులు, ల్యాబ్, ఫార్మసీ పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలని.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహనలు కల్పించాలని సూచించారు. ముందస్తు చర్యలు, జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ సిబ్బందిని హెచ్చరించారు. డీఎంహెచ్‌ఓ వెంట జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సందీప్, మండల వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక, సిబ్బంది ఉన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు



ఉధృతంగా ప్రవహిస్తున్న అడవిసోమన్‌పల్లి మానేరు



చెక్‌డ్యాం మీదుగా ప్రవహిస్తున్న వరదనీరు

మల్హర్: రెండు, మూడు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా జిల్లా సరిహద్దు అడవి సోమన్‌పల్లి మానేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మానేరుకు జలకళ సంతరించుకుంది. మండలంతో పాటు భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలో కురిసిన వర్షాలతో మానేరుకు భారీగా వరద నీరు చేరుకుంది. దీనికి తోడు కరీంనగర్ డ్యాం గేట్లు ఎత్తడంతో వాగుకు ఇరువైపులా నీరు ప్రవహించడంతో మానేరు నిండుకుండలా దర్శనమిస్తోంది. సోమన్‌పల్లి, కొయ్యూరు పీవీనగర్‌కు మధ్యలో ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం మీదుగా వరద నీరు పరవళ్లు తొక్కుతోంది.

క్రీడలతో ఆరోగ్యకర జీవనం

సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జీఎం

భూపాలపల్లి అర్బన్: ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో భాగస్వామ్యం చేసుకొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఏరియాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి వర్క్‌పీపుల్స్ గేమ్స్ అసోసియేషన్ 26వ వార్షిక క్రీడ పోటీలను జీఎం ప్రారంభించారు. ఈ క్రీడాపోటీలు మన ఆరోగ్య సాధనలో భాగం కావాలని, సంస్థకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. సింగరేణి సంస్థ క్రీడల ప్రోత్సాహానికి, యువ ఉద్యోగులలో ప్రతిభను వెలికితీసి దేశ స్థాయిలో రాణించాలనే ఉద్దేశంతో క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. సింగరేణి సంస్థను మొదటి స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని యువ క్రీడాకారులకు, ఉద్యోగులకు జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కవీంద్ర, అధికారులు మారుతి, శ్రావణ్‌కుమార్, నజీర్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రమేష్, మధుకర్‌రెడ్డి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పాక దేవయ్య, కెప్టెన్‌లు పాల్గొన్నారు.

వచ్చే నెల 22నుంచి ఓపెన్ సప్లిమెంటరీ పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: సెప్టెంబర్ 22వ తేదీ నుంచి ఓపెన్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఓపెన్ ఇంటర్, టెన్త్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 6నుంచి 13వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

సాదాబైనామాలకు మోక్షం

జిల్లాలో 51,347 దరఖాస్తులు

- క్రమబద్ధీకరణకు అనుమతిచ్చిన కోర్టు
- ‘భూభారతి’ ద్వారా పట్టాలు
- సన్న, చిన్నకారు రైతులకు మేలు



భూపాలపల్లి అర్బన్: తెల్లకాగితంపై లిఖితపూర్వక ఒప్పందాలతో కొనుగోలు చేసిన భూముల రిజిస్ట్రేషన్లకు అడ్డంకి తొలగడంతో జిల్లాలో వేలాది మంది రైతులకు మేలు జరగనుంది. ప్రభుత్వం 2020 అక్టోబరు 12న జారీ చేసిన జీఓ నంబరు 112ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు ఈ నెల 26న తీర్పు వెల్లడిస్తూ సన్న, చిన్నకారు రైతులకు తీపికబురు అందించింది. 2014 జూన్ 2కు ముందు తమ ఆధీనంలో ఉన్నట్లు చూపిన సన్నకారు రైతులకు భూముల క్రమబద్ధీకరణకు అవకాశం ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. 2020 అక్టోబరు నుంచి 2020 నవంబరు 10 వరకు తెలంగాణ భూమి హక్కులు, పట్టాదారు పాసుబుక్స్ చట్టం–1971 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే సరికి సుమారుగా ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

ఆర్‌ఓఆర్ చట్టంతో..

గ్రామీణ ప్రాంతాల్లో కొన్నేళ్ల కిందట సాదా కాగితంపై భూమి కొనుగోలు చేసి రాయించుకున్న వారిలో అనేకమంది పేర్లు మార్చుకొని పట్టాలు చేసుకోలేదు. ధరణికి ముందున్న ఆర్‌ఓఆర్ చట్టంలో సాదాబైనామాలతో పట్టాలు చేశారు. ధరణి వచ్చిన తర్వాత అవి ఆగిపోయాయి. వాటిని అమలు చేసేందుకు గత ప్రభుత్వం సాదాబైనామాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. 2014 జూన్ 2లోగా లిఖితపూర్వక ఒప్పందంతో భూములు కొన్న రైతుల దరఖాస్తులకు చట్టబద్ధత కల్పించి పాసుపుస్తకాలు జారీచేయాలని భావించింది. 2020 అక్టోబరులో ప్రకటన వెలువరించి నవంబరు 10 వరకు దరఖాస్తులు స్వీకరించగా.. జిల్లాలో 51,347 మంది దరఖాస్తు చేసుకున్నారు.

సాదాబైనామా దరఖాస్తులు

భూపాలపల్లి	14,150
రేగొండ	8,393
గణపురం	7,328
చిట్యాల	5,861
మహాముత్తారం	3,915
మల్హర్	3,072
కాటారం	2,937
మొగుళ్లపల్లి	1,957
మహదేవపూర్	1,739
టేకుమట్ల	1,611
పలిమెల	384
మొత్తం	51,347

పలు సమస్యలు..

- సాదాబైనామా పత్రాలు చట్టపరంగా ధ్రువీకరించినవి కాకపోవడంతో సదరు భూమి మీద హక్కులను రుజువు చేసుకోవటం రైతులకు కష్టంగా మారుతుంది.
- సాదాబైనామా భూములపై పూర్వపు యజమానులు లేదా వారి వారసులు హక్కు కలిగి ఉన్నట్లు కేసులు వేస్తే వాటిని ఎదుర్కోవాల్సి వస్తోంది. భూక్రయ విక్రయాలకు చట్టపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి.
- పట్టా లేకపోవడం వల్ల రాయితీలు, బ్యాంకు రుణాలు అందటం లేదు.
- భూమి అసలు యజమాని ఎవరో తెలుసుకోవడం కష్టమవటంతో సదరు భూముల హక్కుల కోసం వివాదాలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ తర్వాత ఆర్డీఓ ద్వారా నోటీసులు జారీచేస్తారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చుట్టుపక్కల ఉన్న రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతారు. సదరు భూమిని అమ్మింది.. కొన్నది వాస్తవమే అని తేలితే ప్రత్యేక ఆర్డర్ ఇచ్చి రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ కట్టించుకుని క్రమబద్ధీకరణ అవకాశం కల్పిస్తారు.

నాణ్యమైన విద్యాబోధన చేయాలి

కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

కాటారం: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యాబోధన అందించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ఆదేశించారు. కాటారం మండలం దేవరాంపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీరును శుక్రవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఏఐ టెక్నాలజీతో కొనసాగుతున్న కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని మురుగు నీటి నిల్వల నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

నకిలీ సర్టిఫికెట్లతో టీచర్ ఉద్యోగం

భూపాలపల్లి అర్బన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1996లో నిర్వహించిన డీఎస్సీలో నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందిన ఎం.కృష్ణమాచారిని ఉద్యోగంలో నుంచి శాశ్వతంగా తొలగించినట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణమాచారి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా బీఎడ్, డిగ్రీ (ఆంధ్ర విశ్వవిద్యాలయం) సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగం పొందినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ పరీక్షా నియంత్రకులు అతని విద్యార్హతల సర్టిఫికెట్‌లు నకిలీవని తేల్చినట్లు వివరించారు. నకిలీ సర్టిఫికెట్ సమర్పించి ప్రభుత్వ ఉద్యోగం పొందడం చట్టపరంగా చెల్లదన్నారు. కరీంనగర్ జిల్లాలో వివిధ మండలాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి 317 జీఓ నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు కేటాయించారు. కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నప్పటి నుంచే అతనిపై విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. 317 జీఓ ద్వారా జిల్లాకు కేటాయించినప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సర్టిఫికెట్స్ సమర్పించకుండా విధులకు అనధికారికంగా గైర్హాజరయ్యారన్నారు.

క్లుప్తంగా

కాజీపేట-హడప్సర్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌ల పెంపు

కాజీపేట రూరల్ : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే అధికారులు కాజీపేట నుంచి హడప్సర్ వెళ్లే హడప్సర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అప్ అండ్ డౌన్‌లో అదనపు చైర్ కార్ కోచ్‌లు పెంచినట్లు రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. అదనపు కోచ్‌లు సెప్టెంబర్ 1వ తేదీనుంచి అమల్లోకి రానున్నట్లు చెప్పారు.

2న డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల్లో ఫైనల్ ఇయర్‌లో ఒక్క సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులకు సెప్టెంబర్ 2న ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ వెంకటయ్య తెలిపారు. ఈనెల 29న జరగాల్సిన పరీక్షలు భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేశారని పేర్కొన్నారు.

అన్ని రంగాలకు రుణాలు

- హైదరాబాద్ జోన్ హెడ్ ధారాసింగ్ నాయక్


చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

న్యూశాయంపేట : అన్ని రంగాలను ప్రోత్సహించేందుకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణ పథకాలను అమలు చేస్తోందని హైదరాబాద్ జోన్ హెడ్ ధారాసింగ్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం వరంగల్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన దేశవ్యాప్త మెగా రుణ వితరణ కార్యక్రమంలో పాల్గొని పలు రంగాలకు రూ.67 కోట్ల రుణ మంజూరు పత్రాలను వినియోగదారులకు అందజేశారు. ఆగస్టులో మొత్తం రూ.150 కోట్ల రుణాలు వివిధ రంగాలకు సీబీఐ వరంగల్ రీజియన్ మంజూరు చేసిందన్నారు. వరంగల్ రీజినల్ హెడ్ వి.కృష్ణమోహన్, చీఫ్ మేనేజర్లు టి.సాయికుమార్, ఎండీ ఖాదర్, హెచ్.శివశంకర్, బ్రాంచి మేనేజర్లు రాబర్ట్ జోన్స్, జి.రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక వర్షాలు.. సస్యరక్షణ చర్యలు



- వివిధ పంటల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి


డాక్టర్ ఎ.విజయ భాస్కర్, రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, వరంగల్

హన్మకొండ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లో నీరు నిలుస్తోంది.. నీరు అలాగే నిల్వ ఉంటే పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంద. దీంతో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను కాపాడుకోవాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వరంగల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.విజయ భాస్కర్ సూచించారు.

వరి పంటలో..



అధిక వర్షాలకు వరి పైరులో పాము పొడ, కాండం కుళ్లు తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు వాలిడామైసిన్ 2 మిల్లి లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేయాలి. కాండంకుళ్లు తెగులు ఆశించిన పంటలో హెక్సాకొనజోల్ 2 మి.లీ.లీటరు నీటికి లేదా కార్బెండిజం 1 గ్రాము లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధితో 2 సార్లు పిలకల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలి. నీటి ముంపునకు గురైన వరి పొలాల్లో సల్ఫైడ్ దుష్ప్రభావం ఆశించడానికి అనుకూల పరిస్థితులు కనబడుతున్నాయి. దీని గమనించిన రైతులు వరి పంటలో మొక్కల వేర్లకు తగినంత గాలి తగిలే విధంగా మురుగు నీటిని తీసివేయాలి. అదేవిధంగా పొలాన్ని సన్న నెర్రలు వచ్చేవరకు ఆరబెట్టి మళ్లీ నీరు ఇవ్వాలి.

ఆయిల్ పామ్‌లో..



ఆయిల్ పామ్ పంటలో నల్ల కొమ్ము పురుగు ప్రధాన సమస్యగా ఉంది. ఇది కుళ్లిన ఆకులపై గుడ్లు పెట్టి ఎనిమిది నుంచి 11 రోజుల్లో లార్వా దశకు చేరి ఆకుల మట్టలపై కాండం భాగంలో రంధ్రాలు చేసి కణజాలాన్ని తింటుంది. ఇలా చేయడం వల్ల ఎదిగిన ఆకులు'వి' ఆకారంలో ఏర్పడతాయి. వీటి నివారణకు లింగాకర్షణ బుట్టలు అమర్చుకోవడం, ఈ నల్లకొమ్ము పురుగు రెక్కల పురుగుని ఆకర్షింప చేసి నాశనం చేయడం వల్ల వీటి సంతతిని అరికట్టవచ్చు.

మొక్కజొన్నలో..



ప్రస్తుతం మొక్కజొన్న కాయదశలో ఉంది. అధిక వర్షాల వల్ల బ్యాక్టీరియా కాండం కుళ్లు తెగులు సోకింది. వీటినివారణకు 35 శాతం క్లోరిన్ కలిగిన బ్లీచింగ్ పౌడర్‌ను ఎకరానికి 4 కిలోలు చొప్పున పొలంలో సాళ్ల వెంట వేసుకోవాలి. ఆకుమాడు తెగులు ఆశించిన మొక్కలో మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత 5 గ్రాముల 19-19-19 లేదా 20 గ్రాముల డీఏపీని లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

పత్తి పంటలో..

ప్రస్తుతం పత్తి పంట పూత, పిందె నుంచి కాయ వృద్ధి చెందే దశలో ఉంది. నేల ద్వారా వ్యాప్తించే ఎండు తెగులును నివారించడానికి 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బెండిజం, మ్యాంకోజెబ్ కలిగిన శిలీంద్ర నాశనని నీటిలో కలిపి మొక్క మొదళ్లు తడిచేలా వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. వర్షం తగ్గిన తర్వాత మురుగు నీటిని పొలం నుంచి తీసేసి పంట త్వరగా కోలుకోవడానికి 19-19-19 లేదా 13-0-45 లేదా యూరియా 10 గ్రాములు లీటరు నీటికి కలుపుకొని వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను పైపాటుగా 20 రోజుల నుంచి 40 రోజుల వయసున్న పంటకు అందించాలి.



32కిలోల గంజాయి స్వాధీనం

- రూ.16లక్షల విలువైన గంజాయి పట్టివేత
- ఒడిశాకు చెందిన ముగ్గురి రిమాండ్


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ నరేష్‌కుమార్, ఎస్సై అభినవ్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో జీఆర్‌పీలు 32 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. కాజీపేట జీఆర్‌పీ స్టేషన్‌లో సీఐ నరేష్‌కుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిశాకు చెందిన ధరందీర్ నాయక్, రామ బెహెరా, నమిత బెహెరా ముగ్గురు కలిసి 16 ప్యాకెట్లతో గంజాయిని పార్సిల్ చేసి ట్రావెల్ బ్యాగులో భద్రపరిచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మహారాష్ట్రలోని దాదర్‌కు తరలిస్తున్నారు. కాగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గురువారం సాయంత్రం కాజీపేట జంక్షన్‌కు చేరుకోగా తనిఖీలో భాగంగా జీఆర్‌పీ ఎస్సై ఎం.అభినవ్ తన బృందంతో తనిఖీలు చేశారు. పోలీసుల కదలికలు గమనించిన నిందితులు గంజాయి బ్యాగులతో కిందికి దిగి వెళ్తున్నారు. అనుమానం కలగడంతో నిందితులను ఆపి తనిఖీ చేయగా బ్యాగుల్లో గంజాయి తరలిస్తు పట్టుబడ్డారు. వీటి విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని, నిందితుల నుంచి రెండు ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు.. జరిమానా

గోవిందరావుపేట : మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి పోక్సో కేసులో జడ్జి సూర్యచంద్రకళ పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.14వేలు జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని శుక్రవారం తుదితీర్పును వెల్లడించారు. 2022 సంవత్సరంలో గోదా తిరుపతి.. మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని ప్రేమ పేరుతో నమ్మించి అత్యాచారానికి ప్రయత్నించగా సదరు బాలిక పస్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా అప్పటి ఎస్సై కరుణాకర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా జిల్లా ప్రధాన, సెషన్స్ న్యాయమూర్తి సూర్యచంద్రకళ కేసు ట్రయల్ నిర్వహించారు. పీపీ సీహెచ్ సత్యనారాయణ తగిన సాక్ష్యాలను కోర్టులో హాజరు పర్చగా శుక్రవారం నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధించారు. ఎస్పీ డాక్టర్ శబరీష్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశ పెట్టిన ప్రస్తుత ఎస్సై కమలాకర్, కోర్ట్ కానిస్టేబుల్ గిరివాసు, మౌనికలను అభినందించారు.

గోదావరి పరవళ్లు

- కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- అన్నారం బ్యారేజీలో 8.51లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- మేడిగడ్డ బ్యారేజీలో 9.71లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- వందల ఎకరాల్లో నీటమునిగిన పత్తిపంట


కాళేశ్వరం మెయిన్ ఘాట్ వద్ద వరద ఉధృతి

కాళేశ్వరం : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శుక్రవారం పుష్కర ఘాట్‌ను తాకుతూ కాళేశ్వరం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ వద్ద 8.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలి వస్తోంది. దీంతో బ్యారేజీలో మొత్తం 66 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద మహారాష్ట్ర నుంచి వస్తున్న ప్రాణహిత నదితో కలిసి గోదావరి వరద ప్రవాహం పుష్కర ఘాట్లను తాకుతూ 12.330 మీటర్ల ఎత్తులో నీటి మట్టం దిగువకు తరలి పోతుంది. దీంతో ఉదయం సీడబ్ల్యూసీ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అలాగే దిగువన మేడిగడ్డ బ్యారేజీలో 9.71లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో మొత్తం 85 గేట్లు ఎత్తి అదేస్థాయిలో ఔట్‌ఫ్లో నీటిని దిగువకు తరలిస్తున్నారు. అన్నారం సమీపంలోని చంద్రుపల్లి వాగును గోదావరి కమ్మేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అన్నారం నుంచి మద్దులపల్లి, కాళేశ్వరం వెళ్లే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయింది.

నీటమునిగిన పత్తి పంట..

అన్నారం, మద్దులపల్లి, పలుగుల, బలిజాపూర్, పూస్కుపల్లి, కాళేశ్వరం వరకు వందల ఎకరాల్లో పత్తి పంట నీటమునిగింది. అధికారులు సర్వే చేసి పరిహారం చెల్లించాలని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.


మేడిగడ్డ వద్ద వరద ప్రవాహం

మేడారంలో శాశ్వత పనులు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క


గద్దెల ప్రాంగణంలో నూతన నమూనా ప్లాన్

- వందేళ్ల మాస్టర్ ప్రణాళికతో అభివృద్ధి
- సమీక్షలో రాష్ట్ర మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర వందేళ్ల ప్రణాళికతో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. సమ్మక్క-సారలమ్మల గద్దెల వరుస క్రమంలో పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలను ఏర్పాటు పూజారులు సమాలోచనలు చేశారు. శుక్రవారం మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో కలెక్టర్ దివాకర్ టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా, వివిధశాఖల అధికారులు, పూజారులతో కలిసి మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్ రీ డెవలప్‌మెంట్ ప్లాన్, ఆర్కియాలజిస్ట్, వివిధ శాఖల అధికారుల ద్వారా చేపట్టనున్న వివరాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మేడారం జాతరలో శాశ్వత అభివృద్ధి పనులను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చేయాలని ఆదేశించారు. జాతర సమయం వరకు మొదటి విడత పనులు పూర్తి చేయాలన్నారు. భక్తులకు సులువైన దర్శనంకోసం గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను వరుస క్రమంలో ఏర్పాటు చేయాలన్నారు. మహాజాతర పనులు నాణ్యతతో శాశ్వతంగా నిలిచేలా అధికారులు సమీక్షించాలని ఆదేశించారు. ముందుగా మంత్రి సీతక్క అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, ఈఓ వీరస్వామి, అధికారులు పాల్గొన్నారు.

నకిలీ పాస్‌పుస్తకాలతో రుణాలు

- రూ.16.90లక్షల క్రాప్‌లోన్లు పొందిన రైతులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్


నకిలీ పాస్‌పుస్తకాలు


నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు, ఎస్సైలు

కురవి : నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు తయారు చేసి వాటి ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించిన ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. 11మంది రైతులకు వివిధ బ్యాంకుల నుంచి రూ.16.90లక్షల లోన్లు మంజూరు చేయించి బ్యాంకులను బురిడీ కొట్టించిన ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కురవి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. కురవి మండలం నేరడ శివారు ఎలకచెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మంచ్యా తండాకు చెందిన మూడు బాలాజీ, మహబూబాబాద్ మండలం ఆమన్‌గల్ గ్రామ శివారు కస్నా తండాకు చెందిన బానోత్ హరికిషన్, జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం ఒగ్లాపురం గ్రామానికి చెందిన బానోత్ వర్ధన్ ముఠాగా ఏర్పడ్డారు. మూడు బాలాజీ వివిధ ప్రాంతాల్లోని రైతులనుంచి పాస్ పుస్తకాలను సేకరించి, అవి ఎక్కడో పోయినట్లుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయించాడు. రైతుల ఫిర్యాదు మేరకు అధికారులు కొత్తగా డూప్లికేట్ పాస్‌పుస్తకాలు ఇచ్చారు. బాలాజీ ఆయా పాస్ పుస్తకాల్లోని పేజీలను తొలగించి బానోత్ హరికిషన్‌కు ఇస్తే అతను బానోత్ వర్ధన్‌కు అందజేశాడు. బానోత్ వర్ధన్ వాటిని కంప్యూటర్‌లో స్కాన్ చేసి కలర్ జిరాక్స్ తీసి పుస్తకాల్లోని మధ్యలోని ఎకరాల విస్తీర్ణాన్ని పెంచి అతికించాడు. ఇలా ఒక్కో పాస్ పుస్తకానికి రూ.10వేలు తీసుకుని వారు తయారు చేసిన నకిలీ పాస్‌బుక్‌లను ఆయా రైతులకు అందజేశారు. వాటితో కురవి యూనియన్ బ్యాంకునుంచి ఒకరు, డోర్నకల్ బ్రాంచ్‌లో ఆరుగురు, మహబూబాబాద్ బ్రాంచ్‌లో ఒకరు, మహబూబాబాద్ కెనరా బ్యాంకులో ముగ్గురు చొప్పున రూ.16.90లక్షల రుణాలు పొందారు. కాగా వీరు పట్టుబడకపోతే సుమారు రూ.కోటి వరకు రుణాలు పొందేవారని డీఎస్పీ తిరుపతిరావు పేర్కొన్నారు. బ్యాంకుల్లోని ఫీల్డ్ అధికారులు సరిగ్గా పరిశీలన చేయకపోవడంతోనే రుణాలు పొందినట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి నిందితులను పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసుపై బ్యాంకు అధికారులు, ఇతరులను మరింత విచారిస్తామని తెలిపారు. అరెస్టు చేసి ముగ్గురి వద్ద నుంచి 23 పాసు పుస్తకాలకుగాను 11 పుస్తకాలను, మూడు సెల్‌ఫోన్లను, కంప్యూటర్ మానిటర్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఈ కేసులో సీసీఎస్ సీఐ హథీరాం, ఎస్సై ఉషాకుమార్, మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై గంద్రాతి సతీష్ విచారణ చేసినట్లు, వీరిని ఎస్పీ అభినందించినట్లు వివరించారు.

సమాచార హక్కు చట్టంతో పారదర్శక పాలన



సమావేశంలో పాల్గొన్న సమాచార శాఖ కమిషనర్లు, కలెక్టర్ సత్యశారద, మున్సిపల్ కమిషనర్

- కమిషనర్లు అయోధ్యరెడ్డి, శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట : ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టం-2005 పై రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో పీఐఓలు, అప్పిలేట్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలక సాధనమని తెలిపారు. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా చట్టం అమల్లోకి వచ్చిందని, ఇందులోని అంశాలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆర్టీఐ ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాలో వరంగల్ ఒకటి అని చెప్పారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు సకాలంలో పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. మూడేళ్ల నుంచి 17వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, జిల్లాల పర్యటనలతో వీటిని అక్కడికక్కడే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులకు చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆర్టీఐ చట్టంలో 31 సెక్షన్లు, ఆరు చాప్టర్లు ఉన్నాయని ఈ చట్టంపై ప్రతి అధికారి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నిబంధనలకు లోబడి సమాచారం అందించాలని తెలిపారు. సమావేశం తర్వాత పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ దరఖాస్తులపై కమిషనర్లు విచారణ చేపట్టారు. సంబంధిత పీఐఓలు దరఖాస్తుదారుల నుంచి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు. సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన కమిషనర్లకు కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీసీపీలు షేక్ సలీమా, అంకిత్‌కుమార్ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో కమిషనర్లు మొక్కలు నాటారు. సదస్సులో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం ప్రకాశ్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఆర్‌డీఓలు, వివిధ శాఖల పీఐఓలు, అప్పిలేట్ అధికారులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

భయబ్రాంతులకు గురిచేస్తున్నారని ఆత్మహత్యాయత్నం..?

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో

నర్సంపేట రూరల్ : కావాలని కొందరు తనను టార్గెట్ చేస్తూ భయబ్రాంతులకు గురి చేస్తున్నారని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నర్సంపేట పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాధితుడి కథనం ప్రకారం.. నర్సంపేటకు చెందిన వరంగంటి విక్రమ్ సాయి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా పని చేశాడు. 2019-20 సంవత్సరంలో కోమాండ్ల రాజశేఖర్, భూక్య మహేష్‌తో కలిసి తాను జాబ్ చేసినట్లు, అక్కడ తామంతా మోసపోయామని, ఇదే విషయమై హైదరాబాద్ కోర్టులో కేసు కూడా నడుస్తోందన్నాడు. వీరి వద్దనుంచి ఒక్క రూపాయి కూడా తాను తీసుకోలేదని, అక్కడ జరిగిన మోసంలో రాజశేఖర్, మహేష్ తనను డబ్బులు ఇవ్వాలని, లేదంటే చంపుతామని బెదిరిస్తున్నారని వాపోయాడు. ఇటీవల కొందరు వ్యక్తులు తమ మెడికల్ షాపు వద్దకు వచ్చి రాళ్లతో దాడి కూడా చేశారని, పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బెదిరించారు. ఇదే విషయం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి ఫోన్ ద్వారా తెలపడంతో పాలాయి శ్రీనివాస్‌తో మాట్లాడుకోవాలని సూచించగా, తాను వెళ్లి మాట్లాడుదామంటే సమయం కూడా ఇవ్వడం లేదన్నాడు. క్యాంప్ ఆఫీస్ వైపు కూడా రావొద్దని భయబ్రాంతులకు గురి చేస్తున్నట్లు చెప్పాడు. తీవ్ర ఒత్తిడికి లోనైన విక్రమ్ సాయి ఆత్మహత్యా యత్నానికి పాల్పడడంతో స్థానికులు గమనించి నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. విక్రమ్ సాయి ప్రస్తుతం ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. కాని ఆత్మహత్యకు సంబంధించి వీడియో, ప్రెస్ నోట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ విషయంపై పాలాయి శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. జాబ్ విషయంలో డబ్బులు చెల్లించి మోసపోయారని, ఆ విషయంపై బాధితులు ఎమ్మెల్యే వద్దకు వస్తున్నారని తెలిసిందన్నారు. సమస్యను త్వరగా పరిష్కరించుకొని పార్టీ కార్యక్రమాలకు రావాలని అంతవరకు రావొద్దని చెప్పానే తప్పా ఎక్కడ కూడా విక్రమ్‌సాయిని భయపెట్టలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు తీసుకు రావొద్దని ఆయన సూచించారు.

వెల్‌నెస్ సెంటర్‌లో ఉద్యోగుల నియామకానికి గ్రీన్‌సిగ్నల్

హన్మకొండ చౌరస్తా : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్యం అందించేందుకు ప్రత్యేకంగా వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కేంద్ర మంత్రి నడ్డాను కలిసి అనేకసార్లు వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. కాగా ఎంపీ విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం వరంగల్‌కు వెల్‌నెస్ సెంటర్‌ను మంజూరు చేయడంతో పాటు ఉద్యోగుల నియామకానికి శుక్రవారం గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. వెల్‌నెస్ సెంటర్‌లో 13మంది ఉద్యోగులు ఉంటారని, అందులో డాక్టర్లు, నర్సులు, ఫార్మాసిస్టులు, అటెండెంట్లు తదితరులను నియమిస్తారని తెలిపారు. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు వరంగల్‌లోనే వైద్య సదుపాయం అందుబాటులోకి రానుందని ఆమె పేర్కొన్నారు. ఎంపీ కడియం కావ్య కృషి ఫలించడంతో జిల్లాకు చెందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచ పారా అథ్లెటిక్స్‌కు దీప్తి, అకీర ఎంపిక

ఖిలా వరంగల్ : ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీలకు వరంగల్ జిల్లా క్రీడాకారులు దీప్తి జీవాంజి, అకీర ఎంపికయ్యారు. ఈ మేరకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు వి.శేఖర్, జి.ప్రశాంత్ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. పర్వతగిరి మండలానికి చెందిన జీవాంజి దీప్తి పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసిన విషయం తెలిసిందే. అదేవిధంగా నర్సంపేట మండలం రాజుపేటకు చెందిన మరో అథ్లెట్ బానోత్ అకీర నందన్ కూడా ప్రపంచ అథ్లెటిక్స్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూస్టేడియం వేదికగా సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 5వ తేదీవరకు ఈ పోటీలు జరగనున్నాయి. మహిళల 400మీటర్లు (టీ20) పరుగులో దీప్తి, పురుషుల 400 మీటర్ల(టీ 35/38) రేసులో అకీర పాల్గొననున్నారు. ఇద్దరు జిల్లా క్రీడాకారులు ప్రతిష్టాత్మక ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ బరిలో నిలవడంతో ఉమ్మడి జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- ఇద్దరి అరెస్ట్

కాజీపేట : కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఇరువురితో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.6,530ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం ప్రకారం.. కాలనీలోని ఓ ఇంట్లో కొద్దికాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శుక్రవారం రాత్రి దాడి చేసి తాళ్లపల్లి రాధిక, బానోత్ స్వామిని అదుపులోకి తీసుకుని కాజీపేట పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో సీఐ సార్ల రాజు, ఆర్ఎస్సై భానుప్రకాశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.